# వేరుశనగకు కనీస మద్దతు ధర కల్పించాలి

## ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత



హైదరాబాద్, ఫిబ్రవరి 15 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర ప్రభుత్వం వేరుశనగ పంటకు కనీస మద్దతు ధర కల్పించకపోవడంపై ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఆందోళన వ్యక్తం చేశారు. నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట, నాగర్‌కర్నూల్ వ్యవసాయ మార్కెట్లలో రైతుల చేపట్టిన నిరసనలపై ఆమె స్పందించారు. వేరుశనగ పంటకు కనీస మద్దతు ధర రూ.6,377 ఉండగా.. నాలుగు నుంచి ఐదు వేలకే కొనుగోలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ అంశాన్ని శాసనమండలిలో ప్రత్యేకంగా ప్రస్తావించడానికి చైర్మన్ అనుమతి కోరుతూ లేఖ రాశారు. దళారీ వ్యవస్థను పారదోలి రైతుల ప్రయోజనాలను కాపాడాలని, రైతులకు నష్టం కలిగించే వారిపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. రైతులకు గిట్టుబాటు ధర కల్పించడానికి ప్రభుత్వం ముందుకు రావాలని కోరారు.

### రాజీవ్‌గాంధీ విగ్రహం ఏర్పాటుపై పునరాలోచన చేయాలి

సచివాలయ ప్రాంగణంలో రాజీవ్‌గాంధీ విగ్రహం ఏర్పాటు చేయాలన్న నిర్ణయంపై రాష్ట్ర ప్రభుత్వం పునరాలోచన చేయాలని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత విజ్ఞప్తిచేశారు. ఈ అంశంపై శాసనమండలిలో లేవనెత్తేందుకు చైర్మన్ అనుమతిని కోరారు. సచివాలయ ప్రాంగణంలో తెలంగాణతల్లి విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని గత ప్రభుత్వం నిర్ణయించి, స్థలాన్ని కూడా కేటాయించిందని తెలిపారు. పనులు ప్రారంభించే సమయానికి ఎన్నికల కోడ్ రావడంతో తెలంగాణతల్లి విగ్రహాన్ని ఏర్పాటుచేయలేదని వివరించారు. ఆ స్థలంలో రాజీవ్‌గాంధీ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయించడం సరికాదని అభ్యంతరం వ్యక్తంచేశారు. దేశానికి చేసిన సేవల రీత్యా రాజీవ్‌గాంధీ పట్ల తమకు అపారమైన గౌరవం ఉన్నదని, కానీ తెలంగాణతల్లి తెలంగాణకు అత్యంత ముఖ్యమని పేర్కొన్నారు. రాష్ట్ర సాంస్కృతిక వారసత్వాన్ని ప్రభుత్వం గౌరవించి తెలంగాణతల్లి విగ్రహాన్ని ఏర్పాటుచేయాలని డిమాండ్ చేశారు.

# తెలంగాణ చిహ్నంలో రాచరికపు ఆనవాళ్లేవి?

- మండలిలో ప్రభుత్వాన్ని నిలదీసిన ఎమ్మెల్సీ దేశపతి



హైదరాబాద్, ఫిబ్రవరి 15 (నమస్తే తెలంగాణ): తెలంగాణ రాష్ట్ర చిహ్నంలో రాచరికపు ఆనవాళ్లు ఏమున్నాయని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ ప్రశ్నించారు. శాసనమండలిలో గురువారం తెలంగాణ అధికారిక చిహ్నం, తెలంగాణ తల్లి విగ్రహం మార్పుపై గురువారం జరిగిన చర్చలో ఆయన మాట్లాడారు. కాకతీయ తోరణంలో ఎలాంటి రాచరికపు ఆనవాళ్లు ఉన్నాయని ప్రభుత్వాన్ని నిలదీశారు. భూమి, నీటిని తల్లితో పోలుస్తామని, తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న ఓ ప్రొఫెసర్ తెలంగాణ తల్లి ప్రతిమను రూపొందించారని తెలిపారు. తెలంగాణ తల్లి విగ్రహాన్ని చూస్తే ఓ సామాజిక వర్గ దొరసాని గుర్తుకు వస్తుందని ప్రభుత్వ పెద్దలు చెప్పడం సమంజసం కాదని పేర్కొన్నారు. కాకతీయ రాజులు తెలంగాణ సమాజానికి ఎంతో మేలు చేశారని, నిజాం రాజులు హైదరాబాద్ అభివృద్ధిలో చెరగని ముద్ర వేశారని దేశపతి వివరించారు. రాజీవ్‌గాంధీ దేశం కోసం చేసిన సేవలపై గౌరవం ఉన్నదని, జాతీయ నాయకుల పేర్లు పలుచోట్ల పెట్టుకున్నామని, ఇప్పటికే ఎయిర్‌పోర్ట్‌కి రాజీవ్‌గాంధీ పేరు పెట్టుకున్నామని, తెలంగాణ సంస్కృతిని ప్రతిబింబించేలా తెలంగాణ తల్లి విగ్రహం పెట్టాల్సిన చోట రాజీవ్‌గాంధీ విగ్రహం పెట్టడం సరికాదని హితవు పలికారు. అనంతరం సభ్యుల అభ్యంతరాలపై మంత్రి శ్రీధర్‌బాబు సమాధానమిచ్చారు. కాకతీయ తోరణం, తెలంగాణ తల్లి విగ్రహం విషయంలో ప్రజల నుంచి వస్తున్న విజ్ఞప్తులను పరిగణనలోకి తీసుకొని మార్పులు, చేర్పులు చేస్తామని వెల్లడించారు. రాష్ట్ర ప్రజల సెంటిమెంట్‌ను గౌరవిస్తామని తెలిపారు. ప్రభుత్వమే విగ్రహం తయారు చేయదని, అన్నివర్గాల అభిప్రాయాలను ప్రభుత్వం పరిగణనలోకి తీసుకుంటుందని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. విగ్రమం, చిహ్నం తయారీలో బీఆర్‌ఎస్ నేతల సలహాలు తీసుకుంటామని చెప్పారు.

## లోకం పోకడ




మీ రాజకీయ లబ్ధికి నన్నెందుకు వాడుకుంటారయ్యా? పోరాడి తెచ్చుకున్న తెలంగాణ అస్థిత్వపు గుర్తుగా తెలంగాణ తల్లినే వుండనివ్వండి!

# కేటాయింపుల కంటే 5% తక్కువ ఖర్చు చేస్తాం

- బడ్జెట్‌పై ముందే చేతులెత్తేసిన భట్టి



హైదరాబాద్, ఫిబ్రవరి 15(నమస్తే తెలంగాణ): రాష్ట్ర బడ్జెట్‌లో తాము చేసిన కేటాయింపులకు, పెట్టే ఖర్చులకు 5-6% వ్యత్యాసం ఉంటుందని ఆర్థిక శాఖ మంత్రి భట్టి విక్రమార్క స్పష్టంచేశారు. వచ్చే ఆదాయానికీ ఇచ్చే హామీలకు పొంతన లేకుండా పోయిందని, ప్రస్తుత రాజకీయాల్లో అది చేస్తాం, ఇది చేస్తాం అంటూ హామీలు ఇవ్వాల్సిన పరిస్థితి ఏర్పడిందని పేర్కొన్నారు. అసెంబ్లీలో బడ్జెట్‌పై చర్చకు గురువారం ఆయన సమాధానం ఇస్తూ.. బేషజాలకు పోకుండా వాస్తవ పరిస్థితులకు అనుగుణంగా బడ్జెట్‌ను రూపొందించామని తెలిపారు. గతంలో ఏడాదికేడాది 20% చొప్పున బడ్జెట్ పెంచుతూ పోయారని, తాము అలా చేయలేదని చెప్పారు. జాబ్ క్యాలెండర్‌ను విడుదల చేస్తామని, ఇప్పటికే 20 వేలకుపైగా ఉద్యోగాలను భర్తీ చేశామని తెలిపారు. ఆరు గ్యారెంటీల అమలుకు కట్టుబడి ఉన్నామని చెప్పారు.

# కాంగ్రెస్ హామీల అమలుకు 3 లక్షల కోట్లు

- ఆరు గ్యారెంటీలపై శ్వేతపత్రం ఇవ్వండి
- ధరణిని అమలు చేస్తారా.. లేదా?
- శాసనసభలో అక్బరుద్దీన్ ఒవైసీ



హైదరాబాద్, ఫిబ్రవరి 15 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ ఇచ్చిన హామీల అమలుకు రూ.3.07 లక్షల కోట్లు ఖర్చవుతుందని ఎంఐఎం ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఒవైసీ అన్నారు. ఇందులో 6 గ్యారెంటీలకు రూ.2.15 లక్షల కోట్లు కాగా, మిగతా హామీలకు రూ.91 వేల కోట్ల ఖర్చు అవుతుందని చెప్పారు. ఈ నేపథ్యంలో హామీల అమలుకు ఎంత ఖర్చు అవుతుందో ప్రభుత్వం స్పష్టం చేయాలని, దీనిపై శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. గురువారం ఆయన శాసనసభలో మాట్లాడారు. ఆరు గ్యారంటీలకు రూ.53 వేల కోట్లు కేటాయించడం ద్వారా ఆర్థిక శాఖ మంత్రి విఫలమయ్యారని విమర్శించారు. ఇక ధరణిని కొనసాగిస్తారో.. లేదో స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్స్, విదేశీ విద్యానిధి బకాయిలను వెంటనే విడుదల చేయాలని కోరారు.

# వాజపేయి బొమ్మ పెట్టండి

- ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి డిమాండ్



హైదరాబాద్, ఫిబ్రవరి 15 (నమస్తే తెలంగాణ): ఇందిరమ్మ ఇండ్ల పథకానికి కేంద్రం నిధులను వినియోగిస్తూ ఇందిరమ్మ బొమ్మ పెట్టడంపై బీజేపీ ఎమ్మెల్యే మహేశ్వర్‌గౌడ్ అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ పథకంలో భాగంగా మాజీ ప్రధాని వాజపేయి చిత్రాన్ని కూడా పెట్టాలని డిమాండ్ చేశారు. గురువారం ఆయన శాసనసభలో మాట్లాడారు. కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారెంటీల అమలు కోసం రూ.1.50 లక్షల కోట్లు అవసరం కాగా, ప్రభుత్వం రూ.53 వేల కోట్లు కేటాయిందంటూ ఎద్దేవా చేశారు.

# దళితబంధుకు నిధులేవి?

- 12 లక్షల హామీని మరిచారా?
- మా నియామకాలు మీ ఖాతాలోనా?
- జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలి
- 53 వేల కోట్లలో ఏ పథకానికి ఎంత?
- సీఎంగారూ మా వైపు నుంచి మీకు ప్రమాదం లేదు
- మీ వాళ్లతోనే కాస్త జాగ్రత్తగా ఉండండి
- బడ్జెట్‌పై చర్చలో కడియం శ్రీహరి






హైదరాబాద్, ఫిబ్రవరి 15(నమస్తే తెలంగాణ): అంబేద్కర్ అభయహస్తం (దళితబంధు) పథకానికి బడ్జెట్‌లో నిధులు ఎందుకు కేటాయించలేదని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. బడ్జెట్‌లో ఈ పథకాన్ని కనీసం ప్రస్తావించకపోవడం దారుణమని మండిపడ్డారు. ఈ పథకం కింద దళితులకు రూ.12 లక్షలు ఇస్తామన్న హామీని మర్చిపోయారా? అని నిలదీశారు. బడ్జెట్‌పై చర్చ సందర్భంగా శాసనసభలో ఆయన మాట్లాడుతూ.. ఎస్సీలకు ఇచ్చిన హామీ మేరకు రిజర్వేషన్లను 18 శాతానికి పెంచేందుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బడ్జెట్ కేటాయింపులన్నీ ఖర్చు చేస్తామని హామీ ఇవ్వాలని ఆర్థిక మంత్రిని కోరారు. దీనిపై భట్టి విక్రమార్క స్పందిస్తూ.. 5-10% వ్యత్యాసం ఉంటుందని చెప్పారు. దీంతో బడ్జెట్‌ను పూర్తిగా అమలుచేయలేమని ఆర్థికమంత్రే ఒప్పుకొన్నారని కడియం వ్యాఖ్యానించారు.

### నోటిఫికేషన్లు మావి.. భర్తీ మీ ఖాతాలోనా?

ఉద్యోగాల భర్తీకి బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఇచ్చిన నోటిఫికేషన్లను కాంగ్రెస్ ఇచ్చినట్టు చెప్పుకోవడం బాగాలేదని కడియం చురకలేశారు. గత రెండు నెలల్లో ఒక్క నోటిఫికేషన్ కూడా ఇవ్వకుండానే గత ప్రభుత్వం చేసిన నియామకాలను కాంగ్రెస్ ఖాతాలో వేసుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. రెండు లక్షల ఉద్యోగాల భర్తీని ఎప్పుడు పూర్తి చేస్తారో చెప్పాలని, జాబ్ క్యాలెండర్‌ను విడుదలచేయాలని డిమాండ్ చేశారు. బడ్జెట్‌లో కేటాయించిన రూ.53 వేల కోట్లతో ఆరు గ్యారెంటీల అమలు ఎలా సాధ్యమని ప్రశ్నించారు. ఇందులో ఏ పథకానికి ఎంత కేటాయించారో చెప్పలేదని విమర్శించారు. ఇందిరమ్మ ఇండ్ల పథకానికి రూ.23 వేల కోట్లు అవసరం కాగా రూ.7వేల కోట్లు మాత్రమే కేటాయించారని, దీంతో పథకాన్ని ఏవిధంగా అమలుచేస్తారని నిలదీశారు.

### ఫ్రస్టేషన్‌లో ఉన్నదెవరో అర్థమవుతున్నది

బీఆర్‌ఎస్ ప్రతిపక్ష పార్టీ కాదని, ఫ్రస్టేషన్ పార్టీ అంటూ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలపై బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు ఆగ్రహం వ్యక్తంచేశారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలకు ఓపిక లేకుండా పోతున్నదని, నోటికొచ్చింది మాట్లాడుతున్నారని కడియం మండిపడ్డారు. వాళ్ల తీరు చూస్తుంటే ఫ్రస్టేషన్‌లో ఎవరు ఉన్నారో ప్రజలకు అర్థమవుతున్నదని ఎద్దేవా చేశారు.

### సీఎం గారూ మీ వాళ్లతో జాగ్రత్త

మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్ ఆవేశంపై స్పందించిన కడియం శ్రీహరి సీఎం రేవంత్‌రెడ్డికి ఒక సూచన చేశారు. సీఎం రేవంత్, తాను ఒకే కాంపౌండ్ విద్యార్థులమని (టీడీపీ), ఆయన సీఎంగా ఉండాలని కోరుకుంటానని అన్నారు. తమ(బీఆర్‌ఎస్) నుంచి ఎలాంటి ప్రమాదం ఉండబోదని, మీ వాళ్లతో(కాంగ్రెస్) జాగ్రత్తగా ఉండాలని సూచించారు.

## చలి వణుకు

| | కనిష్ఠం | గరిష్ఠం |
|---|---|---|
| రంగారెడ్డి | 14.3°c | 36.3°c |
| మెదక్ | 15.9°c | 35.2°c |
| ఆదిలాబాద్ | 16.1°c | 36.0°c |
| ఖమ్మం | 17.0°c | 34.0°c |
| వరంగల్ | 18.0°c | 32.0°c |
| కరీంనగర్ | 18.0°c | 33.0°c |
| నల్లగొండ | 18.4°c | 34.1°c |
| హైదరాబాద్ | 19.8°c | 31.6°c |
| మహబూబ్‌నగర్ | 20.4°c | 35.8°c |
| నిజామాబాద్ | 20.7°c | 33.3°c |

### ఏడాది నడవనీయండి.. ఆ తర్వాత ప్రభుత్వాన్ని ప్రశ్నిద్దాం: కూనంనేని



హైదరాబాద్, ఫిబ్రవరి 15 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఏడాది పాటు నడవనీయాలని, ఆ తర్వాత హామీల అమలుపై ప్రశ్నిద్దామని సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివ రావు అన్నారు. ఆయన గురువారం శాసనసభలో మాట్లాడుతూ... సంవత్సరం వరకు సమయం ఇచ్చి.. అప్పుడు ఫెయిలైతే అందరం కలిసి ప్రశ్నిద్దామని చెప్పారు. ఏడాది తర్వాత తాము మీతో (బీఆర్‌ఎస్‌తో) కలువవచ్చునేమో అంటూ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు.

# తొలిసారి అధ్యక్షా!..

## మొదటిసారి అసెంబ్లీలో మాట్లాడిన పలువురు సభ్యులు

**నూతన ఎమ్మెల్యేలకు జీరో అవర్‌లో దక్కిన అవకాశం**

**నియోజకవర్గ సమస్యలను ప్రస్తావించిన కొత్త సభ్యులు**

హైదరాబాద్, ఫిబ్రవరి 15 (నమస్తే తెలంగాణ): శాసనసభకు ఎన్నికై ఎమ్మెల్యే హోదాలో అధ్యక్షా.. అంటూ ప్రసంగించాలన్నది ఎంతో మంది రాజకీయ నాయకుల కల. నియోజకవర్గ ప్రజల ప్రతినిధిగా హాజరై తమ ప్రాంత సమస్యలను అసెంబ్లీలో ప్రస్తావించాలని భావిస్తుంటారు. ఆ అవకాశం పలువురు నూతన ఎమ్మెల్యేలకు గురువారం కలిగింది. ఉదయం సభ ప్రారంభమైన తర్వాత మొదట 'జీరో అవర్' నిర్వహిస్తున్నట్టు స్పీకర్ ప్రసాద్‌కుమార్ ప్రకటించారు. మొదటిసారి ఎన్నికైన శాసనసభ్యులు సభలో 57 మంది ఉన్నారని, వారిలో కొందరికి తమ నియోజకవర్గ సమస్యలను ప్రస్తావించే అవకాశం ఇస్తున్నట్టు చెప్పారు.

- ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు మాట్లాడుతూ.. కడెం ప్రాజెక్టు మరమ్మతులకు రూ.5.45 కోట్లు విడుదల చేసినందుకు, సదర్‌మాట్ కెనాల్ నిర్మాణ ప్రకటన చేసినందుకు ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు.
- నారాయణపేట ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి మాట్లాడుతూ.. జీవో 69 ద్వారా నారాయణపేట-కొడంగల్ లిఫ్ట్ ఇరిగేషన్‌కు పరిపాలన అనుమతుల మంజూరీపై నియోజకవర్గ రైతుల్లో హర్షం వ్యక్తమవుతున్నదని తెలిపారు. టెక్స్‌టైల్ పార్క్ ఏర్పాటు చేయాలని, జిల్లా దవాఖానలో సిబ్బంది సంఖ్య పెంచాలని విజ్ఞప్తి చేశారు.
- నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా మాట్లాడుతూ.. ఒక్కో నియోజకవర్గానికి 3,500 ఇందిరమ్మ ఇండ్లు కట్టిస్తామని ప్రభుత్వం చెప్తున్నదని, తమ నియోజకవర్గానికి 7 వేల ఇండ్లు మంజూరు చేయాలని కోరారు. పాఠశాలల్లో మౌలిక వసతులు పెంచాలని విజ్ఞప్తి చేశారు.
- జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు మాట్లాడుతూ.. 2021లో ప్రారంభించిన నాగమడుగు లిఫ్ట్ పనులు త్వరితగతిన పూర్తిచేసి 41 వేల ఎకరాలకు సాగునీరు అందించాలని కోరారు. నియోజకవర్గానికి ట్రామాకేర్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలని కోరారు.

> **జనగామ** ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ.. పాల ఉత్పత్తిదారులకు ఇచ్చే 4 శాతం బోనస్‌ను మరింత పెంచాలని గత ప్రభుత్వం నిర్ణయించిందని గుర్తుచేశారు. పెంచిన బోనస్ రెండు నెలలుగా అందడం లేదని, వెంటనే ఇప్పించాలని కోరారు. పాలను సేకరించి హైదరాబాద్‌కు పంపిన తర్వాత నాణ్యతగా లేవంటూ తిప్పి పంపుతుండటంతో రైతులు నష్టపోతున్నారని సభ దృష్టికి తెచ్చారు. పాల సేకరణ సమయంలోనే నాణ్యత పరీక్షించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సూచించారు.

- భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ మాట్లాడుతూ.. కాళేశ్వరం ప్రాజెక్టుకు మరమ్మతులు చేసి నీళ్లు అందించాలని కోరారు. మెడికల్ కాలేజీ, సింగరేణి దవాఖానలో వసతులు కల్పించాలని విన్నవించారు. నిరుడు మోరంచపల్లెలో కుంభవృష్టితో నష్టపోయిన చిరు వ్యాపారులకు రుణాలు మంజూరు చేయాలని కోరారు.
- కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్‌రావు మాట్లాడుతూ.. ప్రత్యేక అభివృద్ధి నిధులతో చేపట్టిన పనులు కొనసాగిస్తారో.. లేదో స్పష్టత ఇవ్వాలని కోరారు. .
- ముథోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్ సైతం తన నియోజకవర్గ సమస్యలను ఏకరువు పెట్టారు. రాజీవ్‌గాంధీ టెక్నికల్ యూనివర్సిటీ ఇన్‌చార్జి వీసీ వెంకటరమణ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. బాసర సరస్వతి ఆలయ అభివృద్ధికి రూ.50 కోట్లు విడుదల చేయాలని కోరారు.
- వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు మాట్లాడుతూ.. కాకతీయ యూనివర్సిటీలో వసతులు కల్పించాలని కోరారు. ప్రొఫెసర్ల నియామకం చేపట్టాలని విన్నవించారు.
- దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ.. దుబ్బాకకు రెవెన్యూ డివిజన్ మంజూరు చేయాలని కోరారు. రింగ్‌రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని విన్నవించారు.
- సత్తుపల్లి ఎమ్మెల్యే ఎం రాగమయి తమ నియోజవకర్గ పరిస్థితిని వివరించారు. సింగరేణి గనుల్లో తమ ప్రాంతంలో 80 శాతం స్థానిక కోటా అమలు చేయాలని కోరారు. సింగరేణి కాలుష్యంతో అనారోగ్య సమస్యలు వస్తున్నాయని తెలిపారు. సింగరేణి సంస్థతో మాట్లాడి సూపర్ స్పెషాలిటీ దవాఖాన ఏర్పాటు చేయాలని సూచించారు.
- తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ మాట్లాడుతూ.. తిరుమలగిరికి జూనియర్ కాలేజీ ఇవ్వాలని కోరగానే సీఎం మంజూరు చేశారని చెప్పారు. పాలిటెక్నిక్ కాలేజీని బీటెక్ కాలేజీగా అప్‌గ్రేడ్ చేయాలని కోరారు. మోత్కూరులో డిగ్రీ కాలేజీ ఏర్పాటు చేయాలని విన్నవించారు.
- జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి మాట్లాడుతూ.. ఉద్దండాపూర్ రిజర్వాయర్ పనులు వేగంగా పూర్తి చేయాలని కోరారు. తిమ్మాజీపేట-జడ్చర్ల మధ్య 132 కేవీలైన్ పూర్తి చేయాలని కోరారు.
- ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ మాట్లాడుతూ.. రేణుక సిమెంట్ కంపెనీకి 2 వేల ఎకరాల సున్నపురాయి గనుల కేటాయింపుపై సమీక్ష చేయాల్సిన అవసరం ఉన్నదని తెలిపారు. ఆదిలాబాద్‌లో టెక్స్‌టైల్ పార్క్ పెట్టాలని కోరారు.
- భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావ్ మాట్లాడుతూ.. గత ఏడాది పోలవరం బ్యాక్ వాటర్ వల్ల భద్రాచలం పట్టణం 40 శాతం ముంపునకు గురైందని, కరకట్ట నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరారు. ఏరియా దవాఖానలో సిబ్బంది సంఖ్యను పెంచాలని విన్నవించారు.
- వేములవాడ ఎమ్మెల్యే ఆదిశ్రీనివాస్ మాట్లాడుతూ.. వేములవాడ ఆలయ అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని కోరారు. శ్రీపాద సాగర్ ప్రాజెక్టు స్టేజ్-2 ఫేజ్-1 కింద 10 శాతం పనులు పెండింగ్ ఉన్నాయని తెలిపారు.
- సీనియర్ సభ్యుడు, బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే దానం నాగేందర్ మాట్లాడుతూ.. తమ నియోజకవర్గంలోని మూడు ఈద్గా గ్రౌండ్లలో వ్యర్థాలు వేస్తున్నారని చెప్పారు. రంజాన్ వస్తున్నందున ఈ సమస్యను నియంత్రించాలని కోరారు.
- కాలేరు వెంకటేశ్ మాట్లాడుతూ.. నియోజకవర్గంలో ఎమ్మెల్యేలకు ప్రాధాన్యం ఇవ్వడం లేదని చెప్పారు. జీహెచ్‌ఎంసీలో జీతాలు ఇవ్వలేని పరిస్థితి నెలకొన్నదని వాపోయారు. రూ.వెయ్యి కోట్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.
- జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ మాట్లాడుతూ.. తన నియోజకవర్గంలో నిర్మించిన 4,580 డబుల్ బెడ్రూం ఇండ్లను లబ్ధిదారులకు అప్పగించాలని కోరారు. గృహలక్ష్మి పథకం కింద ఇప్పటికే కొందరు నిర్మాణ పనులు మొదలు పెట్టారని వాటిని కొనసాగించాలని విన్నవించారు.
- తమ ప్రాంతానికి వచ్చిన కంపెనీలకు ప్రభుత్వం సహకరించి, త్వరితగతిన ప్లాంట్లు ఏర్పాటయ్యేలా చూడాలని జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్‌రావు కోరారు. మెడికల్ కాలేజీని ప్రారంభించాలని గద్వాల ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి కోరారు. కుమ్రం భీం ప్రాజెక్టుకు మరమ్మతులు చేయించాలని ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి కోరారు. ఎంఐఎం ఎమ్మెల్యేలు బలాల, మీర్ జుల్ఫికర్ అలీ, కౌసర్ మొయినొద్దీన్, మాజిద్ హుస్సేన్ తదితరులు కూడా తమ నియోజకవర్గ సమస్యలను సభలో ప్రస్తావించారు.

> **హుజూరాబాద్** ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి మాట్లాడుతూ.. తాను అసెంబ్లీకి రావడానికి కారణమైన బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్‌కు ధన్యవాదాలు తెలిపారు. తమ నియోజకవర్గంలో 18,021 మందికి దళితబంధు ఇచ్చారన్నారని చెప్పారు. రెండో విడతలో 2,800 మంది అర్హులకు ఇవ్వాల్సిన నిధులను విడుదల చేయాలని కోరారు. దళితబంధు లబ్ధిదారులు ప్రస్తుతం నెలకు రూ.20-30 వేలు సంపాదిస్తున్నారని తెలిపారు. 100 పడకల దవాఖానలో ఐసీయూ పూర్తయిందని, అందుబాటులోకి తేవాలని కోరారు. కేసీఆర్ ప్రభుత్వం 1.63 లక్షల మందికి ఉద్యోగాలు ఇచ్చిందని చెప్పారు. మరికొన్ని ఉద్యోగ నోటిఫికేషన్లు విడుదలయ్యాయని తెలిపారు. మొత్తంగా బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఇచ్చిన 2.33 లక్షల ఉద్యోగాలకు అదనంగా 2 లక్షల ఉద్యోగాల జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.

# అరకొర నిధులతో హామీల అమలు ఎలా?

- ప్రకటించిన పథకాల అమలుకు కావాల్సింది రూ. 1.5 లక్షల కోట్లు
- కేటాయించింది రూ. 53 వేల కోట్లే
- హామీలు మరవొద్దనే గుర్తుచేస్తున్నం
- చనిపోయిన ఆటోడ్రైవర్ల కుటుంబాలకు రూ. 10 లక్షల పరిహారం ఇవ్వాలి
- శాసనసభలో వేముల ప్రశాంత్‌రెడ్డి



హైదరాబాద్, ఫిబ్రవరి 15(నమస్తే తెలంగాణ): బడ్జెట్‌లో కేటాయించిన నిధులతో ఆరు గ్యారంటీల అమలు సాధ్యమయ్యే అవకాశం లేదని బీఆర్‌ఎస్ సభ్యుడు వేముల ప్రశాంత్‌రెడ్డి స్పష్టంచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీల్లోని 13 హామీల అమలుకు ఈ ఏడాది రూ. 1.5 లక్షల కోట్లు అవసరమవుతాయని, కానీ బడ్జెట్‌లో కేటాయించింది రూ. 53 వేల కోట్లేనని గుర్తుచేశారు. గురువారం ద్రవ్య వినిమయ బిల్లుపై చర్చ సందర్భంగా ప్రశాంత్‌రెడ్డి మాట్లాడుతూ గడచిన పదేండ్లలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను విజయవంతంగా అమలుచేసిందని, ప్రజలకు ఇచ్చిన, ఇవ్వని హామీలను కూడా అమలు చేసిన ఘనత తమదేనని పేర్కొన్నారు. తమకంటే మెరుగైన పాలన అందిస్తుందేమోనన్న ఆశతో ప్రజలు కాంగ్రెస్‌కు పట్టం కట్టారని, వారి ఆకాంక్షలను నెరవేర్చే బాధ్యత ప్రభుత్వంపై ఉందని పేర్కొన్నారు. అందుకే హామీలను పదేపదే గుర్తుచేస్తున్నాం తప్పితే మరో ఉద్దేశం ఏమీ లేదని స్పష్టం చేశారు. రైతుబీమా అమలు చేస్తారో? లేదో ప్రభుత్వం స్పష్టంగా చెప్పలేని పేర్కొన్నారు. తాము అధికారంలో ఉన్నప్పుడు మంజూరుచేసి, ప్రక్రియ పూర్తిచేసిన 21,000 ఉద్యోగాలకే నియామకపత్రాలను ఇస్తున్నారని, ఇవికాకుండా ఎన్నికల హామీ ప్రకారం రెండు లక్షల ఉద్యోగాలకు జాబ్ క్యాలెండర్ ప్రకటించాలని కోరారు. ఆసరా పెన్షన్‌దారులకు ఒక నెల పెన్షన్ పెండింగులో ఉందని, 104 సర్వీసు(అంబులెన్స్) సిబ్బందికి నాలుగు నెలలుగా వేతనాలు అందడంలేదని, వెంటనే పెన్షన్, వేతన బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కాలేజీ విద్యార్థుల కోసం తమ ప్రభుత్వం ప్రారంభించి సీఎం బ్రేక్‌ఫాస్ట్ పథకం కూడా నిలిచిపోయిందని తెలిపారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ పథకం వల్ల ఆటో కార్మికులు తీవ్రంగా నష్టపోతున్నారని, వారికి నెలనెలా భృతి కల్పించడంతోపాటు చనిపోయినవారికి రూ. 10 లక్షల నష్టపరిహారం అందించాలని కోరారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం గృహలక్ష్మి పథకం కింద పేదల ఇంటి నిర్మాణం కోసం లబ్ధిదారులకు రూ. మూడు లక్షల చొప్పున మంజూరుచేసిందని, వారికి ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని వర్తింపజేస్తూ రూ. ఐదు లక్షల చొప్పున ఇవ్వాలని కోరారు. కరీంనగర్, నిజామాబాద్ జిల్లాల నుంచి ఉపాధికోసం పెద్ద సంఖ్యలో గల్ఫ్ దేశాలకు వెళ్తుంటారని, వారికి వివిధ వృత్తుల్లో శిక్షణ కోసం తన నియోజకవర్గంలో రూ. ఐదు కోట్లతో నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్స్‌ను మంజూరు చేస్తే, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక దాన్ని రద్దుచేసిందని, వెంటనే పునరుద్ధరించాలని కోరారు.

### విధ్వంసం కాదు.. అభివృద్ధి

బీఆర్‌ఎస్ పాలనలో రాష్ట్రం విధ్వంసం జరిగిందని చెప్పడం పూర్తిగా అవాస్తవమని ప్రశాంత్‌రెడ్డి పేర్కొన్నారు. రాష్ట్రం దివాలా తీస్తే అప్పులు ఎలా వస్తాయని ప్రశ్నించారు. కేసీఆర్ పాలనలో రాష్ట్రం అనేక రంగాల్లో నంబర్ వన్‌గా నిలిచిందని పేర్కొన్నారు. జాతీయ వృద్ధిరేటుకన్నా తెలంగాణ రాష్ట్రం 2.4శాతం అధిక వృద్ధిరేటు నమోదు చేసిందని గుర్తుచేశారు. తమ హయాంలో పరిశ్రమల స్థాపనకోసం రూ. 2.60 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయని, కొత్తగా 18 లక్షల ఉద్యోగాల సృష్టి జరిగిందని పేర్కొన్నారు. 69 లక్షల మంది రైతులకు రైతుబంధు అమలుచేశామని, రైతుల రుణాలు మాఫీ చేశామని, ఉచిత కరెంటు అందించామని తెలిపారు. సాగునీటి ప్రాజక్టుల ద్వారా సాగు విస్తీర్ణం పెరిగిందని చెప్పారు. డబుల్ లేన్ రోడ్లు, ఫోర్‌లేన్ రోడ్లు నిర్మించామని, కొత్తగా 1.33 కోట్ల చదరపు అడుగుల విస్తీర్ణంతో ప్రభుత్వ భవనాలు నిర్మించామని వివరించారు. కొత్తగా 21 మెడికల్ కాలేజీలు ఏర్పాటుచేసి ఎంబీబీఎస్ సీట్లను 8,515కి పెంచినట్టు తెలిపారు. మిషన్ భగీరథ ద్వారా ఇంటింటికీ ఉచితంగా తాగునీరు అందించామని, పలు రాష్ట్రాలు దీనిని ఆదర్శంగా తీసుకున్నాయని ప్రశాంత్‌రెడ్డి వివరించారు.

# కోమటిరెడ్డి తీరుమారలె!

- కేటీఆర్, ఎమ్మెల్యేలపై పరుష వ్యాఖ్యలు
- 'ఏయ్ ఆగవయ ఆగు' అంటూ బెదిరింపు
- మంత్రి తీరుపై బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేల ఆగ్రహం

హైదరాబాద్, ఫిబ్రవరి 15(నమస్తే తెలంగాణ): విమర్శలు వెల్లువెత్తుతున్నా మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తీరుమాత్రం మారడం లేదు. గురువారం అసెంబ్లీలో మరోమారు మాజీ మంత్రి కేటీఆర్, బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలపై పరుష వ్యాఖ్యలు చేశారు. కోమటిరెడ్డి తీరుపై బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు లేచి నిరసన తెలపగా, మరింతగా రెచ్చిపోయిన ఆయన కేటీఆర్‌ను ఉద్దేశిస్తూ 'ఏయ్ ఆగవయా ఆగు' అంటూ పలుమార్లు బెదిరించే ధోరణిలో మాట్లాడారు. సభలోనే మంత్రి బెదిరిస్తున్నారంటూ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు ఆగ్రహం వ్యక్తం చేశారు.

## నిపుణ — విద్య, ఉద్యోగ సమాచారం

### కోస్ట్‌గార్డ్‌లో...

**ఇండియన్ కోస్ట్‌గార్డ్‌లో అసిస్టెంట్ కమాండెంట్ పోస్టుల భర్తీకి ప్రకటన విడుదలైంది.**

- మొత్తం ఖాళీలు: 70
- పోస్టులు: అసిస్టెంట్ కమాండెంట్
- విభాగాలు: జనరల్ డ్యూటీ, టెక్నికల్ (మెకానిక్), టెక్నికల్ (ఎలక్ట్రికల్/ఎలక్ట్రానిక్స్)
- దరఖాస్తు: ఆన్‌లైన్‌లో
- చివరితేదీ: మార్చి 6
- వెబ్‌సైట్: https://joinindiancoastguard.cdac.in

### వైల్డ్‌లైఫ్‌లో...

**వైల్డ్‌లైఫ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియాలో కింది పోస్టుల భర్తీకి ప్రకటన విడుదలైంది.**

- మొత్తం ఖాళీలు: 7
- పోస్టులు: ల్యాబ్ అటెండెంట్, డ్రైవర్, టెక్నికల్ అసిస్టెంట్
- అర్హతలు, వయస్సు, ఎంపిక తదితరాలు వెబ్‌సైట్‌లో చూడవచ్చు
- దరఖాస్తు: వెబ్‌సైట్‌లో
- చివరితేదీ: మార్చి 14
- వెబ్‌సైట్ https://wii.gov.in

### ఐసీఎంఆర్‌లో..

**ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్ (ఐసీఎంఆర్)లో డైరెక్ట్/రెగ్యులర్ ప్రాతిపదికన కింది పోస్టుల భర్తీకి ప్రకటన విడుదలైంది.**

- మొత్తం ఖాళీలు: 8
- పోస్టులు: టెక్నికల్ ఆఫీసర్
- విభాగాలు: బయోమెడికల్ ఇంజినీరింగ్, ఈఈ, కంప్యూటర్/ఐటీ ఇంజినీరింగ్, ఏఐ, ప్రోగ్రామర్ తదితరాలు
- దరఖాస్తు: ఆన్‌లైన్‌లో
- చివరితేదీ: మార్చి 8
- వెబ్‌సైట్: www.icmr.nic.in

### ఆన్‌లైన్‌లో స్టడీ మెటీరియల్

**పోటీ పరీక్షల ప్రత్యేకం**

- పాలిటీ, పీఈటీ, సోషల్ స్టడీస్ (గ్రూప్స్, డీఎస్సీ) కోసం పై క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి.